అధికారుల అలసత్వంతో బిల్లుల జాప్యం

ప్రొద్దుటూరు మున్సిపల్ మీట్





సమావేశానికి అధ్యక్షత వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, మాట్లాడుతున్న కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి

ప్రొద్దుటూరు : అధికారుల అలసత్వం కారణంగా కాంట్రాక్టర్ల బిల్లుల తయారీలో తీవ్ర జాప్యం జరుగుతోందని నాలుగో వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ అత్యాధునిక పరిజ్ఞానంతో 40 రోజుల్లో చంద్రయాన్‌–3ని ప్రయోగించామని, నాలుగు నెలలైనా ఒక టేబుల్ నుంచి మరో టేబుల్‌కు బిల్లు వెళ్లడం లేదన్నారు. పలు సందర్భాల్లో ఈ విషయాన్ని తాను కౌన్సిల్‌లో చర్చించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసే సమయానికి ఫైల్ తయారు చేసి అధికారులు పంపాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం బిల్లులు తరచూ మంజూరు చేస్తోందని, కాంట్రాక్టర్లను వెంటబడి మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పనులు చేయిస్తున్నారన్నారు. బిల్లులు కూడా వేగంగా పంపితే తమకు డబ్బు వస్తుందని తెలిపారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య సమాధానం ఇస్తూ ఇక నుంచి బిల్లులు త్వరగా తయారు చేసి పంపేలా చర్యలు తీసుకుంటామని, ఏ సెక్షన్‌లో మీ బిల్లు ఉందో సమాచారం ఇస్తామన్నారు. వైఎంఆర్‌కాలనీ ప్రవేశ ద్వారం వద్ద మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి దాదాపు రూ.30 లక్షలు వెచ్చించి మున్సిపల్ మాజీ చైర్మన్ పాణ్యం ఎర్రమునిరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. దాని పక్కనే నిర్మిస్తున్న మున్సిపల్ కాంప్లెక్స్‌కు సిరిపురి కాంప్లెక్స్‌గా నామకరణం చేయాలని అజెండాలో పొందుపరిచి అంశాన్ని తెలిపారు. అనిబిసెంట్ స్కూల్ మైదానంలోని ఇండోర్ స్టేడియంకు నిబంధనల ప్రకారం త్వరలో కమిటీని ఏర్పాటు చేస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. స్టేడియంలో సభ్యత్వం కోసం ఎక్స్ అఫిషియో సభ్యులు, జీవిత కాల సభ్యులు, సాధారణ సభ్యులను నమోదు చేస్తామన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకే మున్సిపాలిటీ ఇండోర్ స్టేడియంను నిర్మించిందన్నారు. తమ వార్డులో డ్రైనేజీ కాలువలకు సంబంధించి చాలా రోజులుగా గ్రిల్‌ను నిరుపయోగంగా ఉంచారని, దానిని ఎవరైనా దొంగిలించే అవకాశం ఉందని కౌన్సిలర్ గాజుల శివజ్యోతి తెలిపారు. అమృత్ పథకం ద్వారా ఇప్పటికే పట్టణంలోని ఐదు ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేశామని, త్వరలో పనులు పూర్తి చేసి అన్ని ట్యాంకులకు నీటిని సరఫరా చేస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. పనులు పూర్తయిన ప్రాంతాలకు సంబంధించి ఎక్కడా నీటి సమస్య ఉన్నట్లు కనీసం ఫోన్ కాల్ రాలేదని ఆయన తెలిపారు. ఇందుకు కృషి చేసిన డీఈ దస్తగిరి, ఏఈ దస్తగిరిరెడ్డి, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. 9 ఉన్నత పాఠశాలల్లో 14 మంది పార్ట్ టైం టీచర్లను నియమించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం



సత్యనారాయణ స్వామి వ్రతంలో కలశాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సాయిబాబా మందిరంలో బుధవారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో సామూహికంగా నిర్వహించారు. వేదపండితులు సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించడం వల్ల కలిగే శుభాలను, మహిమలను వివరించారు. పూజా కార్యక్రమ అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది.

క్లుప్తంగా

సీబీఐటీలో ఫేర్‌వెల్ డే



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ జయచంద్రారెడ్డి

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సాయంత్రం ఎంబీఏ విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకను ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ కేవలం ఒకే ఉద్యోగంలో స్థిరపడకుండా తామే ఒక సంస్థను స్థాపించే విధంగా విద్యార్థులు ఆలోచించాలన్నారు. సమాజానికి సేవ చేసే ఆలోచన కలిగి ఉంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులకు, తాము చదివిన సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



మందులను పరిశీలిస్తున్న జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ సి.శారదమ్మ

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురంలో బుధవారం ఆత్మవారి సౌజన్యంతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్యఅతిథులుగా జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ సి.శారదమ్మ, ఆత్మ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎస్.విజయలక్ష్మి, డిప్యూటీ పీఏ పి.పద్మలత, డీఎల్‌డీఏ చైర్మన్ ఆర్.మాధవరెడ్డి, ఉప సంచాలకులు టి.వెంకటరమణయ్య, డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ జీ.రమేష్, పోరుమామిళ్ల సహాయ సంచాలకులు డాక్టర్ కె.చంద్రశేఖర్‌లు హాజరయ్యారు. ఈ శిబిరంలో సుమారు 45 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, సుమారు 40 ఎద్దులు, ఆవులకు లంపీస్కిన్ వ్యాధి రాకుండా టీకాలు, 20 పశువులకు సాధారణ చికిత్సలు, 5 పశువులకు శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల, కాశినాయన మండలాల పశువైద్యాధికారులు, పశువైద్య సిబ్బంది, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ సావిత్రమ్మ

ప్రొద్దుటూరు కల్చరల్ : వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడల పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించాలని ఎంఈఓ సావిత్రమ్మ తెలిపారు. బుధవారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో తొలి సారిగా వ్యాయామ విద్య స్కూల్ కాంప్లెక్స్ మావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలు ఉన్నాయని, వ్యాయామ ఉపాధ్యాయులు ఆ విద్యార్థులను గుర్తించి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుర్రప్ప, కన్వీనర్లు ప్రసాద్‌రెడ్డి, నడిగడ్డ సుధాకర్, 25 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు విత్తన కిట్లు పంపిణీ



రైతులకు విత్తన కిట్లను పంపిణీ చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ అధికారులు

ప్రొద్దుటూరు : మండలంలోని లింగాపురంలో ఉన్న ప్రొద్దుటూరు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ కార్యాలయం వద్ద బుధవారం మైదుకూరు, ప్రొద్దుటూరు డివిజన్లకు సంబంధించిన 89 మంది ఎస్సీ రైతులకు నవధాన్యాల విత్తన కిట్లను పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన (పీఎం–ఏజేఏ) పథకం కింద ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ రైతులకు విత్తన కిట్లను పంపిణీ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఈఓ ఎం.కుమ్ముదా, సీనియర్ అసిస్టెంట్ యు.శ్రీనివాసులు, ఎస్ఎఫ్‌జీ సీనియర్ అసిస్టెంట్ జి.భాస్కర్, అలివల్లహ్, ఆర్.గోపాల్, ప్రొద్దుటూరు ఎఫ్‌పీఓ సీఈఓ వీరమోహన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత రంగంలో నూతన మార్పులు

వైవీయూ : చేనేత రంగంలో నూతన మార్పులు వస్తున్నాయని వైవీయూ లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు అన్నారు. బుధవారం లలితకళా విభాగం విద్యార్థులు క్షేత్రపర్యటనలో భాగంగా ఖాజీపేట మండలం రంగాపురంలోని చేనేత వస్త్ర పరిశ్రమను పరిశీలించారు.

అభివృద్ధికి కృషి చేయండి



రైతు భరోసా పుస్తకాలు ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

పోరుమామిళ్ల : మండలంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందేందుకు, ఎక్కడా ఆరోపణలు, విమర్శలు తలెత్తకుండా మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని వైస్ ఎంపీపీ సియం బాష, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ కోరారు. బుధవారం సభాభవనంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా, అమలు చేస్తున్న పథకాలు అందరికీ అందినపుడే సార్థకత చేకూరుతుందన్నారు. విద్యుత్ శాఖలో పట్టణంలో పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తులు పేద ప్రజల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు వ్యవసాయ భూముల్లో బోరు వేసినపుడు బోరు ఫెయిలయితే మళ్లీ వేయడం లేదని, రిగ్ యజమానికి మాత్రం డబ్బులు ఇస్తున్నారని, ఇందువల్ల రైతుకు ప్రయోజనమేమిటని ప్రశ్నించారు. వ్యవసాయశాఖ ఏడీఏ మండల సమావేశానికి ఎందుకు రావడం లేదని అడిగారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలకు జడ్పీటీసీ, ఎంపీపీలను ఆహ్వానించాలన్నారు. అప్పుడే ఆసుపత్రి పనితీరు గురించి తెలుస్తుందన్నారు. జగనన్న కాలనీలకు అవసరమైన మట్టి, రాయి కొరకు మండలంలోనే క్వారీ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ–2 చెన్ను రాజశేఖర్, తహశీల్దారు గంగయ్య, ఎంపీడీఓ చంద్రమౌళి మాట్లాడారు. విద్య, వైద్య, వ్యవసాయ, విద్యుత్, హౌసింగ్, పశుసంవర్ధకశాఖ, ఉద్యానశాఖ, అటవీశాఖ, ఐసీడీయస్, ఆర్‌డబ్ల్యుఎస్, ఉపాధిహామీ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల్లో జరుగుతున్న పనుల గురించి వివరించారు. సమావేశంలో వ్యవసాయశాఖ రైతుభరోసా పుస్తకాలు ఆవిష్కరించారు. సమావేశంలో మండల కోఆప్షన్ మెంబర్ అల్లా, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

హాజరు పట్టికలను తెలుగులో రాయాలి

చాపాడు : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు హాజరు పట్టికలను తెలుగులోనే రాయాలని ఏపీ అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో సెప్టెంబర్ నెల నుంచి పాఠశాలల హాజరు పట్టికలను తప్పకుండా తెలుగులోనే నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను తాను క్షేత్రస్థాయిలో పర్యటన చేస్తానని చెప్పారు. నిబంధనను పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్‌ఆర్ విగ్రహాలకు మెరుగులు



కల్లూరులో వైఎస్‌ఆర్ విగ్రహానికి రంగులు వేయిస్తున్న కల్లూరు నాగేంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సెప్టెంబర్ 2న శనివారం ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. గ్రామాల్లో, పట్టణాల్లోని వైఎస్‌ఆర్ విగ్రహాలకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా అన్నదానం, పండ్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కల్లూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో, క్రిస్టియన్ కాలనీలో ఏర్పాటు చేసిన వైఎస్ విగ్రహాలకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు. పార్టీ ఆదేశాల మేరకు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

అమృతానగర్ సమస్యలను పరిష్కరించండి



ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డితో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : తమకు పత్రాలు ఉన్నా అధికారులు ఇంటి స్థలం చూపడం లేదని పదే పదే ప్రజలు తనను ఆశ్రయిస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రెవెన్యూ అధికారులను కోరారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయానికి ఎమ్మెల్యే రాచమల్లు బుధవారం వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డితో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎందుకు అమృతానగర్ సమస్య నిత్యం వెలుగులోకి వస్తోందని అన్నారు. రోజూ తన వద్దకు ప్రజలు ఇదే సమస్యపై రావడం, వారిని మీ వద్దకు పంపడం జరుగుతోందన్నారు. ఈ విషయంపై డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 1050 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. అప్పట్లో సర్వే చేసి వారికి స్థలాలు చూపించలేదని తెలిపారు. ఏడాది క్రితం కంపచెట్లను తొలగించి స్థలాన్ని చదును చేసేందుకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి రూ.3లక్షలు ఇచ్చారన్నారు. మొత్తం స్థలాన్ని చదును చేసి రీప్లాటింగ్ చేశామన్నారు. 152 పట్టాలకు సంబంధించిన స్థలంలో పునాదులు ఉండటంతో పరిశీలించి స్థలాలను అప్పగిస్తున్నామన్నారు. పూర్తిగా విచారణ జరిపి సమస్యలు లేకుండా చేస్తామని ఎమ్మెల్యేకు తెలిపారు.

మద్యం షాపును తొలగించండి

మైదుకూరు రోడ్డు నుంచి శ్రీనివాసనగర్‌కు వెళ్లే దారిలో ఉన్న మద్యం షాపును తొలగించాలని ప్రజలు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మద్యం షాపు ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. మద్యం షాపు వద్ద జనం గుంపులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని టూటౌన్ ఎస్ఐ సురేష్‌కు ఎమ్మెల్యే తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి మద్యం షాపు తొలగింపుపై చర్యలు తీసుకుంటామన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

గోపవరం : బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో విద్యాశాఖ, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. 5–18 సంవత్సరాలలోపు పిల్లలు బడికి వెళుతూ మధ్యలో మానివేసినా, మరే కారణంతో బడికి వెళ్ళకుండా ఇంటి వద్ద ఉన్న అలాంటి వారి వివరాలు సేకరించాలని తెలిపారు. జగనన్న ఇళ్ళ నిర్మాణాలను సెప్టెంబరు లోపు పూర్తయ్యేలా హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అవసరమైన వారు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ఆయా సచివాలయాల్లో తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా లబ్ధిదారులతో మాట్లాడాలన్నారు. సమీక్షలో ఎంపీడీఓ హరినారాయణ, ఈఓపీఆర్‌డీ హసీనా, ఎంఈఓలు రఘురాములు, చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డి, వెంకటసుబ్బయ్య, మోశ, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మలదేవి

కలసపాడు : ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని మండలాధ్యక్షురాలు బోదనబోయిన నిర్మలదేవి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యపై దృష్టి సారించాలన్నారు. జగనన్న గృహాలు సకాలంలో పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యలు ఏవైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. నవరత్నాల పథకాలకు అర్హులైన వారు ఉంటే గుర్తించి వారికి పథకాలు అందేలా చూడాలని తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. అనంతరం అన్నిశాఖల అధికారులు మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ అంకన పెద్దగురివిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు అన్నారెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌బీ, తహసీల్దారు రవీంద్రారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ బహిరంగ సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య

ప్రొద్దుటూరు : దేశాన్ని కాపాడండి.. రాష్ట్రాన్ని రక్షించండి అంటూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర గురువారం ఉదయం 11 గంటలకు ప్రొద్దుటూరుకు చేరుకుంటుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య తెలిపారు. పుట్టపర్తి సర్కిల్‌లో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. మండలంలోని పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బహిరంగ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పాల్గొని ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్, సమితి సభ్యులు రామకృష్ణ, హరి, శ్రీను, చంద్రశేఖర్, చిన్న ఓబన్న, ప్రమీల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రక్షాబంధన్





ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాదరెడ్డి, రఘురామిరెడ్డికి రాఖీకడుతున్న శాంత బెహన్‌జీ

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓం శాంతీల ఆధ్వర్యంలో బుధవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విజయనగరం వీధిలోని ఓం శాంతిభవన నిర్వాహకురాలు బీకే శాంత ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి ఆయన ఇంట్లో రాఖీ కట్టారు. అలాగే మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారుమునిరెడ్డి, కౌన్సిలర్ పిట్టా బాలాజీలకు రాఖీ కట్టారు. రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సోదరీ సోదర భావంతో మెలగాలన్నారు. మానవీయ విలువకు ప్రతీక రక్షాబంధన్ వేడుక అని తెలిపారు. ఆత్మరక్షణకు, విజయానికి గుర్తుగా శ్రావణ మాసంలో శ్రావణ పౌర్ణమి రోజున రాఖీ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అలాగే స్థానిక గీతాశ్రమం వీధిలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థినులు కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ, ఒన్‌టౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ మంజునాథ్, ట్రాఫిక్ పోలీసులకు రాఖీ కట్టారు. కోఆర్డినేటర్ గౌరీశంకర్, ఎన్‌సీసీ ట్రైనర్ దావీద్ పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండుగ

పోరుమామిళ్ల : పట్టణంలో రాఖీ పండుగ సందర్భంగా బుధవారం బ్రహ్మకుమారీ ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఓం శాంతి సభ్యులు పలువురు ప్రముఖులకు రాఖీలు కట్టారు. స్థానిక ఓంశాంతి నిర్వాహకురాలు స్వప్న అక్కయ్య పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సియం బాషా, సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, తహశీల్దారు గంగయ్య, ఎంపీడీఓ చంద్రమౌళి, సర్పంచులు రవిప్రకాష్‌రెడ్డి, సుధాకర్, పట్టణ వైద్యులు తదితరులకు రాఖీ కట్టారు. అలాగే మిఠాయిలు అందజేసి వారికి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి



మాట్లాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రొద్దుటూరు : ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం యూనియన్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం అవసరం లేదని, పాత పెన్షన్ విధానమే కావాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంటా రామ్మోహన్, సీపీఎస్ జిల్లా కన్వీనర్ నరేష్, పట్టణ గౌరవాధ్యక్షుడు హరిరామకృష్ణ, యూనియన్ నాయకులు గురువయ్య, జాకీర్, జోసెఫ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు ప్రణాళిక అవసరం



తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో భూమిరెడ్డి పావని

మైదుకూరు : విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఒక ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని కొద్ది రోజుల కిందట గ్రూప్–1 పరీక్షల్లో రెండో ర్యాంకు సాధించిన భూమిరెడ్డి పావని అన్నారు. బుధవారం మైదుకూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర)లో హెచ్‌ఎం రమాదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పావని మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని తెలిపారు. ఏర్పరచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికబద్ధంగా చదవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల సన్మానాన్ని పావని సున్నితంగా తిరస్కరించి, తనను అనునిత్యం ప్రోత్సహిస్తూ ఈ స్థాయికి చేరేలా చేసిన తన తల్లిదండ్రులకు గౌరవం దక్కాలన్నారు. ఆ మేరకు ఉపాధ్యాయులు పావని తల్లిదండ్రులు గంగయ్య, లక్ష్మీదేవిలను వారు సత్కరించారు. కార్యక్రమంలో గోశెట్టి రామ్మోహన్, మీసాల మునెయ్య, ఆనందరావు, సూర్యనారాయణ రెడ్డి, సురేంద్ర, పద్మజ, స్వర్ణలత, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యాపరాల వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఉత్తమ మేలుజాతి దూడల ప్రదర్శన



దూడల ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఎల్‌డీఏ చైర్మన్ మాధవరెడ్డి

కలసపాడు : మండలంలోని ఎగువరామాపురం గ్రామంలో బుధవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో మేలుజాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ సి.శారదమ్మ, డీఎల్‌డీఏ చైర్మన్ ఆర్.మాధవరెడ్డి, డీఎల్‌డీఏ ఈఓ జీ.రమేష్, పశుగణాభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ శివరామిరెడ్డి, పోరుమామిళ్ళ ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.చంద్రశేఖర్‌లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సుమారు 46 దూడలను ప్రదర్శించడం జరిగిందన్నారు. మేలుజాతి దూడలలో మూడింటికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి రైతుకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టేకూరుపేట పశువైద్యాధికారి డాక్టర్ బి.శివ శ్రీనివాసులరెడ్డి, నరసాపురం పశువైద్యాధికారి డాక్టర్ సి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలోని అంశాలను తరగతిలో అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేసి పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలని కడప ఎంఈఓ పాలెం నారాయణ పేర్కొన్నారు. బుధవారం కడపలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్‌లో హెచ్‌ఎం నాగమణి ఆధ్వర్యంలో కాంప్లెక్స్‌స్థాయి ఒక్క రోజు సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా కాంప్లెక్స్ సమావేశానికి అన్ని పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు హాజరుకావాలన్నారు.

నిత్య సహాయకులు ఆరోగ్యమాత

కడప కల్చరల్ : ఆరోగ్యమాత నిత్య సహాయకులని, విశ్వాసులందరికీ ఆమె సహాయం చేస్తూనే ఉంటుందని, అందుకే మనం ఉన్నత స్థితిలో ఉన్నామని కడప పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ వరప్రసాద్ తెలిపారు. ఆరోగ్యమాత క్షేత్రం నవదిన ఉత్సవాలలో భాగంగా రెండవరోజు బుధవారం జరిగిన కార్యక్రమంలో ఫాదర్ మరియదాస్ దివ్యబలి పూజను సమర్పించగా, వరప్రసాద్ మరియ తల్లి దివ్య సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరియ తల్లి సహాయ సహకారాలు లేకుండా మానవాళి అభివృద్ధి చెందదని, ఆరోగ్యం, విద్య, వైద్యం, ఉపాధి, గౌరవం, సిరి సంపదలు ఆమె మనకు సహాయంగా ప్రసాదించినవేనన్నారు. మరియ తల్లి తన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా మన రక్షణ బాధ్యత వహిస్తోందన్నారు. మనం ఆ తల్లిని గౌరవిస్తూ ఆమె అడుగుజాడల్లో నడవాలని, ఆమె కోరిన విధంగా ప్రతి కుటుంబం భక్తిమార్గంలో పయనించాలని కోరారు. దివ్యబలి పూజకు ముందు ప్రత్యేకంగా అలంకరించబడిన తేరుపై మేరీమాత స్వరూపాన్ని ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహించారు. పాటలు, తేరు దివ్యబలి పీఠం అలంకరణ తదితరాలను పాస్టరల్ సెంటర్ గాయక బృందం నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎండి ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్, ఆరోగ్యమాత అమ్మగార్లు, మేత్రాసన కోశాధికారి ఫాదర్ దేవదాస్, మల్టీ పర్పస్ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ ఫాదర్ బాలరాజు, తిరుణాల కమిటీ సభ్యులు అంతోని, సెభాస్టియన్, రాజా డేవిడ్, మోహన్, ఏంజెలినా, జిల్లాలోని వివిధ గురువులు పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.